క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

సదాశివపేట(సంగారెడ్డి): సీఎం సహాయనిధి సద్వినియోగించుకోవాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. మండలంలోని వెల్టూర్ గ్రామానికి చెందిన ఖాజా మైనోద్దిన్ కూతురు ఐమన్ సారిహా బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో చికిత్స పొందుతుంది. అత్యవసర చికిత్స నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి రూ. 2 లక్షల ఎల్‌ఓసీ మంజూరయింది. ఆదివారం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ బాధితురాలి తండ్రికి అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, సంగారెడ్డి మాజీ కౌన్సిలర్ రామప్ప, మాజీ సర్పంచ్ శ్రీహరి పాల్గొన్నారు.

జిమ్ ఏర్పాటుకు స్థలం పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని సింఫనీ పార్క్ హోమ్స్ కాలనీలో ఆదివారం కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ పర్యటించారు. కాలనీవాసులతో కలిసి కాలనీలో బహిరంగ వ్యాయామశాల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు నాగరాజుయాదవ్, కాలనీ అధ్యక్షుడు సత్తిరాజు, కాలనీవాసులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారులు



చిన్నారులకు జ్ఞాపిక అందజేస్తున్న మాతాజీ

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని దత్తగిరి కాలనీలోని బసవ మండపంలో ఆదివారం చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. రాష్ట్రీయ బసవదళ్ ఆధ్వర్యంలో శ్రావణమాసం పురస్కరించుకుని బసవ మండలంలో కర్నాటక రాష్ట్రంలోని నాగూర్ గురుబసవ పీఠాధిపతి పూజ్యశ్రీ బసవగీత మాతాజీ నెల రోజుల ప్రవచనాలు బోధించారు. శ్రావణమాసం ముగింపు సందర్భంగా చిన్నారులు నిర్విజ్ఞ, మాధవిలు భరతనాట్యం ప్రదర్శన ఇచ్చారు. వివిధ భక్తి పాటలకు సంప్రదాయబద్ధం నృత్యం చేశారు. ఈ మేరకు బసవమాతాజీ చిన్నారులను సన్మానించి, జ్ఞాపిక అందజేసి అభినందించారు.

అట్టహాసంగా నగర సంకీర్తన



హరేకృష్ణ మంత్రాన్ని జపిస్తున్న భక్తులు

జహీరాబాద్: పట్టణంలో 169వ నగర సంకీర్తన కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని శ్రీరాం మహెలా, నగులకట్ట కాలనీల్లో శోభాయాత్రను నిర్వహించారు. ఉదయం రామాలయానికి చేరుకుని అక్కడి నుంచి భక్తులు నృత్యాలు, శ్రీకృష్ణ కీర్తనలు పాడుతూ శోభాయాత్రలో పాల్గొన్నారు. హుగ్గెల్లి గ్రామంలో సైతం నగర సంకీర్తన శోభాయాత్రను భక్తులు నిర్వహించారు.

సత్సంగ్‌తో భక్తిభావం

మాజీ డీఎస్పీ, ప్రచారకురాలు నళిని



మాట్లాడుతున్న మాజీ డీఎస్పీ నళిని

జహీరాబాద్ టౌన్: సత్సంగం వల్ల భగవంతుడిపై భక్తిభావం పెరుగుతుందని మాజీ డీఎస్పీ ఆర్యసమాజ్ ప్రచారకురాలు నళిని పేర్కొన్నారు. శ్రావణ మాసం ముగింపు సందర్భంగా పట్టణంలోని ఆర్యసమాజ్‌లో ఆదివారం పూర్ణహుతి యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మంది జంటలు యజ్ఞంలో పాల్గొని పూజలు నిర్వహించారు. నళిని మాట్లాడుతూ.. భగవంతుడిని కీర్తించి, యజ్ఞాలు చేయడం వల్ల ఆధ్యాత్మిక జ్ఞానం లభిస్తుందన్నారు. భజనలు, కీర్తనల వల్ల కూడా భగవంతుడిని కీర్తించిందేకు వీలుకల్గుతుందన్నారు. యజ్ఞ పూర్ణహుతిలో ఆర్య సమాజ్ అధ్యక్షుడు రామచంద్రయ్య, కార్యదర్శి సుధీర్ బండారీ, ఉపాధ్యక్షుడు గాలయ్య, గాయత్రి, నామ రవికిరణ్, అశోక్‌భెల్కేరీ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరిగితేనే స్పందిస్తారా?

వరదల్లో కొట్టుకుపోయిన రోడ్లు
- డిప్యూటీ కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు
- గ్రామీణ ప్రాంత రోడ్లపై ప్రయాణం నరకం



రాసోల్ వెళ్లే రోడ్డుపై వంతెన కింద కూలిన గోడ



నామమాత్రంగా లెవల్ చేసిన రాసోల్ వంతెన డైవర్షన్ రోడ్డు

కంగ్టి(నారాయణఖేడ్): గ్రామీణ ప్రాంత రోడ్లు గుంతలమయంగా మారి ప్రయాణం నరకప్రాయంగా మారింది. భారీ వర్షాల కారణంగా అధికారులు తాత్కాలికంగా రాకపోకలు ఆపేసి రోడ్లపై గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ట్రాలీలు అడ్డుగా పెట్టారు. అత్యవసర వైద్య సేవలు అందేదెట్లా అని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని రాసోల్, ముర్కుంజాల్ గ్రామాల మధ్య సాములవాగు నీరు ప్రవహించే వంతెన కింద గోడ కూలి రెండేళ్లు అవుతున్నా ఎవరూ పట్టించుకున్న పాపానపోలేదు. దీంతో వంతెన శిథిలావస్థకు చేరడంతో తాత్కాలికంగా పైపులు వేసి డైవర్షన్ రోడ్డు వేశారు. నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి పర్యటించి నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న వంతెన వద్ద డైవర్షన్ రోడ్డు ఎత్తు పెంచాలని అధికారులను ఆదేశించారు. అయినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాకపోకలు నిలిపివేత

గతవారంలో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని రాసోల్‌-ముర్కుంజాల్ రోడ్డు, తడ్కల్‌-బాన్సువాడ రోడ్డు, జమ్గి(కే)-జమ్గి(బీ)రోడ్డు, కంగ్టి-ముకుందనాయక్ తండా రోడ్డు, కంగ్టి- భీంరా రోడ్డులపై రాకపోకలు తాత్కాలికంగా నిలిపివేయాలంటూ పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం సంబంధిత పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులు మరమ్మతులు నిర్వహించినా.. నామమాత్రంగా మొరం వేస్తున్నట్లు స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొద్దిపాటి వర్షాలకే మళ్లీ ప్రమాదపుటంచున ప్రయాణాలు చేయాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాకపోకలు పునరుద్ధరించాం

ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు కోతకు గురి కావడంతో రాసోల్, జమ్గి(బీ), ముకుందతండా రోడ్లుపై మొరం వేసి రాకపోకలు పునరుద్ధరించాం. డైవర్షన్ రోడ్డుపై ఎత్తు పెంపు చర్యలు ఇంకా చేపట్టలేదు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకొంటాం.

–వంశీనాయుడు, ఏఈ, పంచాయతీరాజ్, కంగ్టి

వీరభద్రుడి ఆలయంలో లక్ష బిల్వార్చన



న్యాయమూర్తులతో ఆలయ కమిటీ సభ్యులు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని వీరన్నగూడెం శ్రీ భద్రకాళి వీరభద్ర స్వామి ఆలయంలో ఆదివారం పాలకమండలి చైర్మన్ మద్ది ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు లక్ష బిల్వార్చన నిమజ్జన పూజా క్రతువులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజల్లో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూరేపల్లి నంద, జస్టిస్ అనిల్ కుమార్ జూకంటి, జిల్లా జడ్జి భవానిచంద్ర, ఆర్డీఓ రవీందర్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మద్ది ప్రతాప్ రెడ్డి ధర్మకర్తల బృందంతో కలిసి వారికి మేళ తాళాలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో కార్యనిర్వాహాధికారి శశ్త గుప్తా, ఆలయ మాజీ చైర్మన్ నాగేందర్ గౌడ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, పాలకమండలి సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ చెడి.. పంటకు అందని తడి



నీరులేక ఎండిపోయిన వరిపొలం

జిన్నారం(పటాన్‌చెరు): ట్రాన్స్‌పార్మర్ మరమ్మతులకు నోచుకోకపోవడంతో పొలాలకు నీరందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిన్నారం మున్సిపాలిటీ పెద్దమ్మగూడెం శివారులోని వాగువద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నాలుగు రోజుల క్రితం చెడిపోయింది. బోర్లపై ఆధారపడి పండిస్తున్న పొలాలు పూర్తిగా ఎండిపోయాయని రైతులు వాపోతున్నారు. ప్రతి ఆరునెలలకోసారి ఇదే పరిస్థితి నెలకొంటుందన్నారు. సమస్యను విద్యుత్ అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తే పంట నష్టం వాటిల్లదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టి ట్రాన్స్‌పార్మర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

సాధారణ స్థితిలోనే మంజీరా గేట్లు



దిగువ ప్రాంతానికి నీరు విడుదల

సంగారెడ్డి టౌన్: హైదరాబాద్ నగరానికి మంచి నీరు సరఫరా చేస్తున్న మంజీరా బ్యారేజీ గేట్లు సాధారణ స్థితిలోనే ఉన్నాయని మంజీరా బ్యారేజ్‌ను జలమండలి అధికారులు, సంగారెడ్డి ఎమ్మార్వో జయరాం అన్నారు. ఆదివారం మండలంలోని మంజీరా డ్యామ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంజీరా గేట్లు అన్నీ సక్రమంగా పనిచేస్తున్నాయని అన్నారు. ప్రస్తుతం మంజీరా నుంచి 2 క్రెస్ట్ గేట్లు, 1 స్కవర్ వెంట్ ద్వారా 15,130 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారన్నారు. సింగూర్ నుంచి ప్రవాహం 9,226 క్యూసెక్కులు ఉండగా అలాగే.. 13 నుంచి ఉ. 6:00 గంటల వరకు గేట్లలో ఎటువంటి అంతరాయం లేకుండా సగటున 46,000 క్యూసెక్కులతో మొత్తం 28.09 టీఎంసీని విడుదల చేశారు. మంజీరా బ్యారేజికి, గాని, గేట్లకు ఎలాంటి ముప్పు లేదని జలమండలి అధికారులు అధికారికంగా ప్రకటించారు.

శ్రమను గౌరవించే దేశాల్లోనే అభివృద్ధి

సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు



సమావేశంలో మాట్లాడుతున్న బీవీ రాఘవులు

పటాన్‌చెరు టౌన్: శ్రమను గౌరవించే సంస్కృతి ఉన్న దేశాలు మాత్రమే అభివృద్ధి చెందుతాయని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు పేర్కొన్నారు. మనదేశ జనాభాలో 50 శాతంగా ఉన్న మహిళలు ఉత్పత్తిలో భాగస్వాములైతేనే నిజమైన అభివృద్ధి సాధించినట్లు అవుతుందన్నారు. పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలోని శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ 40వ వార్షికోత్సవ కార్యక్రమాల ముగింపు సందర్భంగా ఆదివారం జరిగిన కార్మిక కుటుంబాల ఆత్మీయ సమ్మేళనం సభకు ఆయన హాజరై మాట్లాడారు. ఒక ప్రైవేట్ పరిశ్రమలో ఒకే నాయకత్వంలో నిరంతరాయంగా 40 ఏళ్ల పాటు ఐక్యంగా కొనసాగడం అభినందనీయమన్నారు. సీఐటీయూ సిద్ధాంతాలకు లోబడి మొదటినుంచీ కార్మికులను రాజకీయ చైతన్యం చేసుకుంటూ ప్రజాతంత్ర పని విధానం ద్వారా శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ అనేక అద్భుత విజయాలను సాధించిందని చెప్పారు. కేవలం తమ జీతభత్యాల కోసమే కాకుండా సామాజిక, సంఘీభావ కార్యక్రమాలలో సైతం చురుగ్గా పాల్గొంటూ ఇతర సంఘాలకు ఆదర్శంగా నిలిచిందని అభినందించారు. కార్యక్రమంలో శాండ్విక్ యూనియన్ నాయకులు పాండు రంగారెడ్డి, మనోహర్, వీరారావు, సదాశివరెడ్డి, సత్తిబాబు, కమిటీ సభ్యులు, కార్మికులు వారి కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కంగ్టి(నారాయణఖేడ్): కంగ్టి మండలంలోని ఎన్కెమూరి గ్రామంలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ దుర్గారెడ్డి తెలిపారు. గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు శనివారం రాత్రి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి పేకాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారి వద్ద పట్టుబడిన రూ. 3100 నగదు సీజ్ చేసినట్లు తెలిపారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ నైబర్‌హుడ్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణ పరిధి కేసీఆర్ నగర్‌లో మెగా జాబ్‌మేళా, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ గారి రమణ మాట్లాడుతూ.. ప్రభుత్వ డబుల్ బెడ్రూం ఇళ్లలో నివాసముండే వారికి ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో జాబ్ మేళా నిర్వహించామన్నారు. అలాగే, ఉచిత వైద్య శిబిరం నిర్వహించమన్నారు. కార్యక్రమానికి మంచి స్పందన వచ్చిందని చెప్పారు. రానున్న రోజుల్లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సేవ కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అజయ్‌కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పండగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

ఎస్‌ఐ లవకుమార్

వట్‌పల్లి(అందోల్): ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి, మిలాద్‌-ఉన్‌-నబీ వేడుకలను జరుపుకోవాలని ఎస్‌ఐ లవకుమార్ అన్నారు. ఆదివారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు, మైనార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించే ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. మండపాల దగ్గర విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. గణేశ్ నిమజ్జన సమయంలో డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. పోలీసులకు సహకరించాలని కోరారు.

పాత పెన్షన్ విధానంతోనే మేలు

జహీరాబాద్ టౌన్: ఉపాధ్యాయ, ఉద్యోగులకు శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్‌ను అమలు చేయాలని మొగుడంపల్లి మండల తపస్ అధ్యక్షుడు మల్లయ్యస్వామి డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ.. 2014 సంవత్సరంలో సీపీఎస్ విధానాన్ని తీసుకువచ్చారు. ఈ విధానం వల్ల ఉపాధ్యాయ, ఉద్యోగులకు తీవ్ర నష్టం కల్గుతుందని వాపోయారు. పాత పెన్షన్ విధానాన్ని మళ్లీ తీసుకురావాలని కోరారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తానని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత మాట తప్పిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎస్ రద్దుకు ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు.

ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించడం సరికాదు



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న బాధ్యులు

నారాయణఖేడ్: ఖేడ్ హష్మీ మసీదు ప్రత్యక్ష నిర్వహణ బాధ్యతలు వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్‌కు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇవ్వడం సరికాదని పలువురు మసీదు ముస్లిం పెద్దలు అసహనం వ్యక్తం చేశారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ మసీదుకు 90 ఎకరాల భూములు ఉన్నాయన్నారు. భూములను అన్యాక్రాంతం చేసేందుకు ఈప్రాంతంతో ఎలాంటి సంబంధం లేని వారు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. మసీదు భూములు, ఆస్తులపై కోర్టు ఇదివరకే ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చినా మసీదు నిర్వహణ, ఆస్తులపై జోక్యం తగదన్నారు. మసీదు భూములను కాపాడాలని కోరుతూ ఈ మేరకు ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ఈత మొక్కలు పంపిణీ చేయాలి



ఈత మొక్కల నర్సరీని పరిశీలిస్తున్న నాయకులు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): కల్లుగీత సొసైటీలకు ప్రభుత్వం ఈత మొక్కలను పంపిణీ చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి బూడిద గోపి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పెద్దాపూర్‌లోని నర్సరీలో పెంచుతున్న ఈత మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రతి సొసైటీకి భూమి ఇచ్చి ఈత మొక్కలను పంపిణీ చేస్తామని గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. నర్సరీల్లోని మొక్కలను ప్రభుత్వం కొనుగోలు చేసి కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘాలకు పంపిణీ చేయాలన్నారు. అలాగే, ప్రభుత్వ భూముల్లో, చెరువు కట్టలపైన రోడ్లకు ఇరువైపులా ప్రాజెక్టుల కట్టల కింద నాటించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్న గౌడ్, నాయకులు జంగన్న గౌడ్, రమేష్ గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు రామాగౌడ్, జనార్దన్ గౌడ్, నవీన్ గౌడ్, సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు వేయాలని ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు, కాలనీవాసులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పలు కాలనీల్లో రోడ్లు వేయాలని సీపీఎం నాయకులు ఆదివారం ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ నాయకులు మహిపాల్ మాట్లాడుతూ పట్టణంలోని అల్లీపూర్ క్రిస్టియన్ కాలనీలోని రోడ్లు ధ్వంసమై గుంతలమయంగా మారాయి. మురికి కాల్వలు లేక మురికినీరు రోడ్లపై నుంచి పారుతుందని వాపోయారు. కొన్ని సంవత్సరాల నుంచి ఈ రోడ్డుకు కనీస మరమ్మతులు కూడా చేయడం లేదని మండిపడ్డారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టి మురి కి కాల్వలు నిర్మించాలని కోరారు. సంతకాల సేకరణతో కూడా వినతిపత్రం అధికారులకు అందజేశారు. ధర్నాలో సీపీఎం నాయకులు నరేశ్, కిరణ్, శ్రీకాంత్, జోనానరేష్, అనిల్, కాలనీవాసులు ఉన్నారు.

ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు



మాట్లాడుతున్న రాములు నేత

జహీరాబాద్ టౌన్: రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జాగో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాములు నేత అధికారులను కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పట్టణంలోని ప్రధానరోడ్లు, ఫుట్‌పాత్‌లను అక్రమించుకుని యథేచ్ఛగా వ్యాపారులు చేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందన్నారు. కొంతమంది మురికి కాల్వలపై నిర్మాణాలు చేపట్టి కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్, పోలీసు అధికారులు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు శివప్రసాద్, నిజాం, దశరథ్ పాల్గొన్నారు.

నేటి ధర్నాను విజయవంతం చేయండి

బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభుగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుగౌడ్

సంగారెడ్డి: హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద నేడు నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభు గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడారు. ధర్నాలో అన్ని పార్టీలు.. అన్ని జిల్లాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పటోళ్ల మల్లికార్జున పాటిల్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ గోకుల్ కృష్ణ, జిల్లా నాయకులు వెంకటేశం, కార్యదర్శి సుధాకర్‌గౌడ్, రవి, మహిళా నాయకురాలు మంగగౌడ్, గౌరీశ్వర్, పాండురంగం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అధిక వర్షాలతో రైతులకు భారం



సోయాబీన్‌లో కలుపు మొక్కలను తొలగిస్తున్న కూలీలు

జహీరాబాద్: ఎడతెరిపి లేని వర్షాలకు పంటలను కలుపు మొక్కలు కమ్మేశాయి. నియోజకవర్గంలోని జహీరాబాద్, కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్, మొగుడంపల్లి మండలాల్లోని పంటల్లో కలుపు మొక్కలు ఏపుగా పెరిగి వచ్చాయి. దీంతో కలుపు మొక్కలను తొలగించడం రైతులకు భారంగా మారింది. కలుపు మొక్కలు తొలగించేందుకు కూలీలకు పని చెప్పారు. సోయాబీన్, మొక్కజొన్న, పత్తి, కంది, మినుము పంటల్లో కలుపు మొక్కలు అధికంగా వచ్చినట్లు రైతులు పేర్కొంటున్నారు. వాటిని తొలగించేందుకు ఎకరాకు రూ. 5వేలకు పైగా ఖర్చు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. అధిక వర్షాల వల్ల ఒక వైపు పంటలు దెబ్బతినగా, మిగిలిన పంటను అయినా తీసుకోవాలనే ఉద్దేశంతో కలుపు మొక్కలను తొలగించుకుంటున్నట్లు రైతులు చెబుతున్నారు.

వాడవాడలా వినాయక మండపాలు



సదాశివపేట పట్టణంలో సిద్ధం చేసిన మండపం

సదాశివపేట(సంగారెడ్డి): మరో మూడు రోజుల్లో సర్వ విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుడి పండుగ చిన్నా పెద్ద అందరూ ఉత్సాహంగా జరుపుకోనున్నారు. ఊరు– వాడ, పట్టణం తారతమ్యం లేకుండా అందరూ కలిసికట్టుగా జరుపుకొనే పెద్ద పండుగ. ఇప్పటికే పట్టణాలు, గ్రామాల్లో మండపాలు సిద్ధం చేస్తున్నారు. సదాశివపేట పట్టణంలోని 26 వార్డు గల్లీలో విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు నిర్వాహకులు మండపాలను సిద్ధం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ ఎత్తున విగ్రహాలు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే కొన్ని విగ్రహాలు మండపాలకు చేరుకోగా మిగిలిన విగ్రహాలు మంగళవారం రాత్రి వరకు మండలపాలకు చేరుతాయి. యువత మండపాల వద్ద బిజీబిజీగా గడుపుతున్నారు. పట్టణ పరిధిలో 100కు పైగా విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు.

ఉచిత వైద్య శిబిరాలతో ప్రయోజనం



రోగులకు చికిత్సలు అందిస్తున్న వైద్యులు

మునిపల్లి(అందోల్): ఆయా ఆస్పత్రుల వారు గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్య క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీపీ రాంరెడ్డి సూచించారు. ఆదివారం మండలంలోని తాటిపల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రదీప్‌రెడ్డి ఆధ్వర్యంలో సదాశివపేటలో ఓ ప్రైవేట్ ఆస్పత్రి వైద్య సిబ్బంది ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, జ్వరం, దగ్గు, కంటి వ్యాధులకు చికిత్సలు అందించి రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పెంటయ్య, కాంగ్రెస్ నాయకులు వెంకట లక్ష్మారెడ్డి, రాయికోడ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మైపాల్ పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు పాడై ఇబ్బందులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధి ముంగి ప్రధాన చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు పాడైపోయి ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తొమ్మిదేళ్ల క్రితం ఎంపీ కోట కింద మంజూరైన రూ.2లక్షలు వెచ్చించి హైమాస్టు లైటు ఏర్పాటు చేశారు. లైట్లు ఏర్పాటు చేసిన కొంత కాలం పని చేశాయి. అనంతరం అవి పాడైపోయాయి. ప్రధాన చౌర స్తా కావడంతో రాత్రి వేళ్లలో చీకటి నెలకొని ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకొని వాటిని బాగు చేయించాలని వారు కోరుతున్నారు.